# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 | సంచిక : 161 | శనివారం 14, ఫిబ్రవరి 2026 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


# రెండేళ్ల పాలనకు ప్రజామోదం

## పురపోరులో చెయ్యికే జై కొట్టిన జనం



- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పట్టం నాలుగు కార్పొరేషన్లు, 64 పుర పీఠాలు 'హస్త'గతం
- ఇది తమ రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదమని సీఎం రేవంత్ వ్యాఖ్య
- పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి దక్కిన తీర్పుగా అభివర్ణన
- ప్రతి కార్యకర్తకు ఈ విజయాన్ని అంకితం ఇస్తున్నట్లు ప్రకటన
- ప్రతి మున్సిపాలిటీని అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తమ రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన బలమైన తీర్పు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని అందించిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రజా ప్రభుత్వ పాలనకు, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి, ప్రపంచస్థాయి ప్రణాళికలతో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ తీర్పు ద్వారా ప్రజలు సంపూర్ణ ఆమోదం

..మిగతా 2లో

# మున్సిపోల్స్‌లో హస్తం హవా

- కాంగ్రెస్ ఖాతాలోకి 90కి పైగా స్థానాలు
- గట్టి పోటీ ఇచ్చిన బీఆర్ఎస్
- పలు స్థానాల్లో హంగ్
- బీజేపీకి నిరాశ మిగిల్చిన ఫలితాలు
- క్యాంప్ రాజకీయాలతో ఉత్కంఠ
- ప్రజా నమ్మకానికి గుర్తింపని వ్యాఖ్యలు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలలో, ఏడు కార్పొరేషన్‌లలో మొత్తం 2,569 వార్డుల ఓట్ల లెక్కింపు ముగిసిన తరువాత, కాంగ్రెస్ పార్టీ ఎక్కువగా గెలుపొందింది. ఎన్నికల ఫలితాల ప్రకారం, 90 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించి, రాష్ట్ర వ్యాప్తంగా తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు తమ ఆశించిన 85 నుండి 90 స్థానాల లక్ష్యాన్ని సులభంగా సాధించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా

..మిగతా 3లో



# బంగ్లాదేశ్‌లో రాజకీయాల్లో పెను మార్పులు



- ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం
- తారిక్ రెహమాన్‌కు దక్కిన అధికారం
- భారత్–బంగ్లా సంబంధాలపై చర్చ
- జల వివాదాలు, సరిహద్దులపై ఆందోళన
- హిందువుల భద్రతపై తలెత్తుతున్న ప్రశ్నలు
- బంగ్లా ప్రయోజనాలే ముఖ్యమంటున్న తారిక్

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** బంగ్లాదేశ్ రాజకీయాల్లో పెద్ద మార్పు చోటు చేసుకుంది. మాజీ ప్రధాని షేక్ హసీనా పదవి వీడిన తర్వాత దేశం తీవ్ర అనిశ్చితిలోకి జారుకుంది. విద్యార్థి ఉద్యమాలు, హింసాత్మక ఘటనలు, తాత్కాలిక ప్రభుత్వ ప్రయోగం... ఇలా ఎన్నో పరిణామాల తర్వాత తాజాగా జరిగిన పార్లమెంట్

..మిగతా 3లో

# సమిష్టి కృషితోనే గెలుపు సాధ్యమైంది

- ఎన్నికల ఫలితాలపై మంత్రి పొన్నం ప్రభాకర్
- సంక్షేమ పథకాలే ఆధారమయ్యాయని వెల్లడి
- గెలిచిన ప్రజాప్రతినిధులకు అభినందనలు
- మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తామని హామీ
- పారదర్శక వ్యవస్థను నిర్మిస్తామన్న మంత్రి




**హైదరాబాద్, (ప్రజాస్వరం):** రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఫలితాలు కేవలం ఒక పార్టీ విజయంగా కాకుండా, ప్రజల నమ్మకానికి ప్రతిఫలంగా చూడాలని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై పట్టణ ప్రజలు విశ్వాసం ఉంచినట్టు ఈ తీర్పు

..మిగతా 3లో

# వీధి కుక్కలపై మధ్యేమార్గం అవసరం

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్
- ప్రజలకు అతి భావనలు ఉండొద్దని వెల్లడి
- సమతుల దృక్పథంతో ఉండాలని సూచన
- జాతీయ సింపోజియంలో కీలక ప్రసంగం
- టీకాలు, స్టెరిలైజేషన్ వాడాలని పిలుపు
- ప్రకృతితో అనుసంధానం కోల్పోవద్దన్న భగవత్



**హైదరాబాద్, (ప్రజాస్వరం):** దేశవ్యాప్తంగా వీధి కుక్కల సమస్య పై చర్చ మరింత ముదిరింది. వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల తర్వాత అనుకూల, ప్రతికూల స్వరాలు గట్టిగా వినిపిస్తున్నాయి. జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, మరి కొందరు ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని కఠిన చర్యలు అవసరమని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు

..మిగతా 2లో

# సేవా తీర్థ్ లోకి ప్రధాని కార్యాలయం

- చరిత్రాత్మక సౌత్ బ్లాక్‌కు వీడ్కోలు
- నూతన సముదాయాన్ని ప్రారంభించిన మోదీ
- డిజిటల్ విధానంలో రూపకల్పన
- భవిష్యత్ అవసరాల కోసమేనని వెల్లడి
- ఒకే ప్రాంగణంలో కీలక శాఖలు
- అధికారుల మధ్య పెరగనున్న సమన్వయం




**హైదరాబాద్, (ప్రజాస్వరం):** బ్రిటిష్ పాలన కాలం నుంచి దేశ పరిపాలనకు కేంద్రమైన సౌత్ బ్లాక్ చరిత్రాత్మక అధ్యాయానికి ముగింపు పలికింది. ప్రధాన మంత్రి కార్యాలయం ఇప్పుడు కొత్త చిరునామా 'సేవా తీర్థ్'కు మారింది. ఆధునిక సదుపాయాలతో నిర్మించిన ఈ ఇంటిగ్రేటెడ్ పరిపాలనా సముదాయాన్ని

..మిగతా 2లో

# కాంగ్రెస్ వైఫల్యాలకు ఇది నిలువుటద్దం.!

- మున్సిపల్ ఫలితాలు కాంగ్రెస్‌కు హెచ్చరిక : హరీష్ రావు
- 700 పైగా వార్డుల్లో బీఆర్ఎస్ విజయం
- రేవంత్ సర్కార్ పాలనపై తీవ్ర విమర్శలు
- కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రతిపక్ష పోరాటం కొనసాగనుంది



**హైదరాబాద్, (ప్రజాస్వరం):** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరిక అని మాజీ మంత్రి

..మిగతా 2లో

# మున్సిపల్ ఫలితాలు ఉత్సాహాన్నిచ్చాయి

- ప్రజా తీర్పుపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు
- భవిష్యత్‌లో కొత్త కార్యాచరణ ఉంటుందని వెల్లడి
- పార్టీ బలంగానే ఉందన్న కేటీఆర్
- 15 మున్సిపాలిటీల్లో స్పష్టమైన ఆధిక్యం
- రీకౌంటింగ్‌లపై అనుమానాలు
- కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపణ



**హైదరాబాద్, (ప్రజాస్వరం):** రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మొత్తం మీద తమ పార్టీకి మంచి ఫలితాలు వచ్చాయని, భవిష్యత్‌లో ఇంకా మెరుగైన విజయాలు సాధించేందుకు స్పష్టమైన

..మిగతా 2లో

www.prajaswaramdaily.com WWW.PRAJASWARAMDAILY.COM

# వీధి కుక్కలపై మధ్యేమార్గం అవసరం

**మొదటిపేజీ తరువాయి**

ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

నాగపూర్‌లో ఇండియన్ సొసైటీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ కానైన్ ప్రాక్టీస్, మహారాష్ట్ర యానిమల్ అండ్ ఫిషరీ సైన్సెస్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ సింపోజియంలో ఆయన ప్రసంగించారు. "ఒక ఆరోగ్యంలో కుక్కల పాత్ర - భాగస్వామ్యాన్ని నిర్మించడం, సవాళ్లను పరిష్కరించడం" అనే అంశంపై జరిగిన ఈ సమావేశంలో సమాజం తీసుకోవాల్సిన దిశపై ఆయన అభిప్రాయాలు వెల్లడించారు.సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో డాగ్ లవర్స్ పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. వీధి కుక్కలను బలవంతంగా తరలించడం తగదని వారు వాదిస్తున్నారు. మరోవైపు, కుక్కల దాడులతో గాయపడిన వారు, పిల్లల భద్రతపై ఆందోళన చెందుతున్న కుటుంబాలు మాత్రం కఠిన నియంత్రణ అవసరమని అంటున్నారు. ఈ వివాదం సామాజిక మాధ్యమాల్లో కూడా తీవ్ర చర్చకు దారితీసింది.


ఈ పరిస్థితులపై స్పందించిన మోహన్ భగవత్, సమతుల్య దృక్పథం అవసరమని చెప్పారు. "ఢిల్లీలో పెద్ద గందరగోళం జరిగింది. ఒక వర్గం కుక్కలను పూర్తిగా తొలగించాలంటుంది. ఇంకొక వర్గం వాటిని అసలు ముట్టుకోకూడదంటుంది. ఈ రెండు అతి భావనలు సమాజానికి ఉపయోగకరంగా ఉండవు" అని వ్యాఖ్యానించారు.తనను ఈ అంశంపై అడిగినప్పుడు మధ్యమార్గం ఉండొచ్చని చెప్పానని తెలిపారు. కుక్కల జనాభా నియంత్రణ కోసం స్టెరిలైజేషన్ వంటి చర్యలు తీసుకోవచ్చని సూచించారు. భద్రతా చర్యలు, అవగాహన కార్యక్రమాలు చేపడితే సమస్యను తగ్గించవచ్చని అన్నారు. మానవులు, జంతువులు, ప్రకృతి కలిసి జీవించాల్సిందేనని ఆయన అభిప్రాయపడ్డారు. సమతుల్య సహజీవనం ఎలా సాధ్యమవుతుందో సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతితో అనుసంధానం కోల్పోతే సమస్యలు పెరుగుతాయని చెప్పారు.

**పశువైద్యుల పాత్ర కీలకం**

ఈ సందర్భంగా పశువైద్యుల ప్రాధాన్యంపై కూడా మోహన్ భగవత్ మాట్లాడారు. "గతంలో పశువైద్యుల పాత్ర పరిమితమేనని అనుకున్నాం. కానీ అది సరైంది కాదు. జంతువుల ఆరోగ్యం, నియంత్రణ, సంక్షేమం వంటి విషయాల్లో వారికి విస్తృతమైన అవగాహన ఉంది" అని అన్నారు. జంతువులపై నిర్ణయాలు తీసుకునేటప్పుడు పశువైద్యులు, జంతుశాస్త్ర నిపుణులను సంప్రదించాలని సూచించారు. అవసరమైన జ్ఞానం, అనుభవం వారికే ఉంటుందని పేర్కొన్నారు. ప్రత్యేక పశువైద్య మండలి ఉండాలని, ఆ మండలికి తగిన అధికారాలు ఇవ్వాలని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

క్రీడా రంగంలో నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఆ రంగానికి చెందిన నిపుణుల అభిప్రాయాలే ప్రధానమవుతాయని ఉదాహరణ ఇచ్చారు. అలాగే జంతువుల విషయాల్లో కూడా పశువైద్యులే ముందుండాలని అన్నారు. నిపుణుల సూచనలతో ముందుకు సాగితే సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలోని అనేక నగరాల్లో వీధి కుక్కల దాడులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు లక్ష్యంగా మారుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఆసుపత్రుల్లో కుక్కల కాటుకు గురైన వారి సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. రేబిస్ వంటి వ్యాధుల భయం కూడా ప్రజల్లో ఉంది.

ఇక జంతు ప్రేమికులు మాత్రం కుక్కలను తరలించడం లేదా హింసించడం మానవత్వానికి విరుద్ధమని అంటున్నారు. వాటి సంరక్షణ, టీకాలు, స్టెరిలైజేషన్ ద్వారా సమస్యను పరిష్కరించవచ్చని సూచిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, వీధి కుక్కల సమస్య ఒక్కరోజులో పరిష్కారం కాదని స్పష్టం చేస్తున్నారు. నగరాల విస్తరణ, చెత్త నిర్వహణ లోపాలు, పెంపుడు కుక్కలను వదిలేయడం వంటి కారణాల వల్ల ఈ సమస్య పెరిగిందని చెబుతున్నారు. కాబట్టి స్థానిక సంస్థలు, పశువైద్య శాఖలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. వీధి కుక్కల సమస్యపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది. ఒకవైపు ప్రజల భద్రత, మరోవైపు జంతు హక్కులు ఈ రెండు మధ్య సమతుల్యం ఎలా సాధించాలన్నదే ప్రధాన ప్రశ్న. మోహన్ భగవత్ సూచించినట్లుగా మధ్యమార్గాన్ని అన్వేషిస్తూ, నిపుణుల సలహాలతో ముందుకు సాగితే సమస్యకు దశలవారీ పరిష్కారం లభించే అవకాశం ఉంది. సమాజం మొత్తం కలిసి ఆలోచించి, బాధ్యతతో వ్యవహరిస్తేనే మానవులు, జంతువులు, ప్రకృతి మధ్య సఖ్యత సాధ్యమవుతుంది. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే తదుపరి చర్యలపై దేశం దృష్టి సారించింది.



# రెండేళ్ల పాలనకు ప్రజామోదం

**మొదటిపేజీ తరువాయి**

తెలిపారని ఆయన శుక్రవారం పేర్కొన్నారు.

రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. వెలువడిన ఫలితాల ప్రకారం, 116 మున్సిపాలిటీలకు గాను 66 చోట్ల కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. అలాగే 7 కార్పొరేషన్లలో 3 చోట్ల స్పష్టమైన మెజారిటీ సాధించగా, మరో కార్పొరేషన్‌లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని మరో 37 మున్సిపాలిటీలలో కూడా పీఠాలను కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

ఈ చారిత్రక విజయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల అవిశ్రాంత శ్రమకు దక్కిన ఫలితమే ఈ విజయం. పార్టీ పట్ల వారికి ఉన్న అపారమైన అభిమానానికి ఇది నిలువుటద్దం. పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

ఈ గెలుపు తమ బాధ్యతను మరింత పెంచిందని సీఎం అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి, పారదర్శక పాలనకు తాము పునరంకితం అవుతున్నామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీని, ప్రతి కార్పొరేషన్ను అభివృద్ధి పథంలో నడిపించి చూపిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ఫలితాలు ప్రభుత్వ పనితీరుకు ప్రజలు ఇచ్చిన సానుకూల తీర్పుగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.



# 'సేవా తీర్థ్'లోకి ప్రధాని కార్యాలయం

**మొదటిపేజీ తరువాయి**

ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కీలక కార్యనిర్వాహక విభాగాలను ఒకే చోటకు తరలించడం ఇదే తొలిసారి. పరిపాలనలో వేగం పెంచడం, శాఖల మధ్య సమన్వయం మెరుగుపరచడం లక్ష్యంగా ఈ సముదాయాన్ని రూపొందించారు. ఇప్పటివరకు సౌత్ బ్లాక్‌లో కొనసాగిన ప్రధాన మంత్రి కార్యాలయం ఇకపై సేవా తీర్థ్ నుంచే పని చేయనుంది. సేవా తీర్థ్‌లో మూడు ముఖ్యమైన కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉంటాయి. ప్రధాన మంత్రి కార్యాలయం, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్, క్యాబినెట్ సెక్రటేరియట్ ఇక్కడ పనిచేస్తాయి. దీంతో దేశ భద్రత, విధాన నిర్ణయాలు, పరిపాలన సంబంధిత కీలక అంశాలపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుంది.

ఇక కర్తవ్య భవన్1, కర్తవ్య భవన్2లో పలు కీలక మంత్రిత్వ శాఖలు ఏర్పాటు చేశారు. ఆర్థిక, రక్షణ, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, న్యాయ, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు ఈ సముదాయంలోనే పని చేయనున్నాయి. ఇంతవరకు వేర్వేరు భవనాల్లో ఉన్న శాఖలు ఇప్పుడు ఒకే చోట ఉండటంతో అధికారుల మధ్య సమన్వయం పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కొత్త సముదాయాన్ని పూర్తిగా డిజిటల్ విధానంలో రూపొందించారు. శాఖల మధ్య డేటా షేరింగ్, ఈగవర్నెన్స్ సపోర్ట్ వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయి. సెంట్రలైజ్డ్ రిసెప్షన్, పబ్లిక్ ఇంటర్ఫేస్ జోన్లు ఏర్పాటు చేశారు. పౌరులు, ప్రతినిధులు, విదేశీ అతిథులు సులభంగా సేవలు పొందేలా ప్రణాళిక రూపొందించారు.

భవన నిర్మాణం 4స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా ఉందని అధికారులు తెలిపారు. శక్తి పొదుపు, పర్యావరణ అనుకూల సదుపాయాలు, విస్తృత పార్కింగ్, సౌకర్యవంతమైన సమావేశ మందిరాలు ఏర్పాటు చేశారు. సిబ్బందికి అనుకూలంగా వర్క్‌స్టేషన్లు, కమ్యూనికేషన్ సిస్టమ్‌లు అమర్చారు. దేశ పరిపాలనకు కేంద్రబిందువైన సముదాయం కావడంతో భద్రతా ఏర్పాట్లకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. స్మార్ట్ యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థలు, ఇంటిగ్రేటెడ్ సర్వైలెన్స్, ఆధునిక అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగం ఏర్పాటు చేశారు. ప్రవేశ ద్వారాల వద్ద బయోమెట్రిక్ పద్ధతులు అమలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉంటాయి.



ప్రధాన మంత్రి కార్యాలయం మారడంతో ఖాళీ కానున్న సౌత్ బ్లాక్, నార్త్ బ్లాక్ భవనాలకు కొత్త ఉపయోగాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. అక్కడ 'యుగే యుగీన్ భారత్ సంగ్రహాలయ' పేరుతో విస్తృత పబ్లిక్ మ్యూజియం ఏర్పాటు చేయనున్నారు. భారత చరిత్ర, సంస్కృతి, స్వాతంత్ర్య పోరాటం, ఆధునిక భారత వికాస గాథలను ప్రజలకు పరిచయం చేసే విధంగా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ మార్పుతో చారిత్రాత్మక భవనాలు ప్రజలకు మరింత అందుబాటులోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. పరిపాలనకు వినియోగించిన స్థలాన్ని ఇప్పుడు సాంస్కృతిక, విద్యా అవసరాలకు ఉపయోగించనున్నట్టు తెలిపింది.

సేవా తీర్థ్ ప్రారంభంతో కేంద్ర పరిపాలనలో కొత్త దశ మొదలైందని అధికారులు పేర్కొన్నారు. కీలక శాఖలు ఒకే ప్రాంగణంలో పనిచేయడం వల్ల ఫైళ్ల మార్పిడి, సమావేశాలు, విధాన నిర్ణయాలు వేగంగా జరిగే అవకాశముందని అభిప్రాయపడ్డారు. సాంకేతిక వనరుల వినియోగం పెరగడంతో పారదర్శకత కూడా మెరుగవుతుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమర్థవంతమైన పరిపాలన కోసం మౌలిక సదుపాయాల అభివృద్ధి అవసరమని అన్నారు. దేశ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ సముదాయాన్ని నిర్మించామని చెప్పారు. ప్రజలకు వేగవంతమైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

దాదాపు శతాబ్దానికి పైగా దేశ పరిపాలనకు కేంద్రంగా ఉన్న సౌత్ బ్లాక్ నుంచి ప్రధాన మంత్రి కార్యాలయం మారడం ఒక చారిత్రక పరిణామంగా భావిస్తున్నారు. బ్రిటిష్‌కాలంలో నిర్మితమైన ఆ భవనం స్వాతంత్ర్యం తర్వాత కూడా కీలక పరిపాలన కేంద్రంగానే కొనసాగింది. ఇప్పుడు సేవా తీర్థ్ రూపంలో ఆధునిక అవసరాలకు అనుగుణంగా కొత్త అధ్యాయం ప్రారంభమైంది.కేంద్ర పరిపాలనలో సమగ్రత, వేగం, సాంకేతిక సామర్థ్యాన్ని పెంచే దిశగా సేవా తీర్థ్ అడుగు వేసిందని ప్రభుత్వం చెబుతోంది. ఇకపై దేశానికి సంబంధించిన కీలక నిర్ణయాలు ఈ కొత్త సముదాయం నుంచే వెలువడనున్నాయి.

# మున్సిపల్ ఫలితాలు ఉత్సాహాన్నిచ్చాయి

**మొదటిపేజీ తరువాయి**

కార్యాచరణ సిద్ధం చేస్తామని తెలిపారు. మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ పలు అంశాలపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు.ఈ ఎన్నికల్లో దాదాపు 700 నుంచి 800 వార్డుల్లో గెలుస్తామని భావించామని కేటీఆర్ చెప్పారు. అధికారిక లెక్కల ప్రకారం 15 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ స్పష్టమైన ఆధిక్యం సాధించిందన్నారు. మరో 37 మున్సిపాలిటీల్లో హంగ్ పరిస్థితి నెలకొన్నప్పటికీ తమకు గణనీయమైన స్థానాలు వచ్చాయని వివరించారు. మొత్తంగా 30 శాతానికి పైగా వార్డుల్లో విజయం సాధించడం సానుకూల సంకేతమని పేర్కొన్నారు.2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికలను గుర్తుచేస్తూ, అప్పట్లో బీఆర్ఎస్ 122 మున్సిపాలిటీల్లో గెలిచిందని, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం తక్కువ స్థానాల్లో మాత్రమే విజయం సాధించాయని తెలిపారు. ప్రస్తుత ఫలితాలు పరిస్థితులు మారినా తమ పార్టీకి బలమైన స్థానం ఉన్నట్టు చూపిస్తున్నాయని చెప్పారు.

**రీకౌంటింగ్‌లపై ఆరోపణలు**

కొన్ని చోట్ల రీకౌంటింగ్‌ల విషయంలో అనుమానాలు ఉన్నాయని కేటీఆర్ అన్నారు. గద్వాలలో ఒక వార్డులో నాలుగు సార్లు రీకౌంటింగ్ నిర్వహించారని, వర్ధన్నపేటలో కూడా పలుమార్లు ఓట్ల లెక్కింపును పునరావృతం చేయడంతో కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అవసరమని సూచించారు.అధికార కాంగ్రెస్ పార్టీ కొన్ని చోట్ల అధికార యంత్రాంగాన్ని వినియోగించుకుని విజయం సాధించిందని కేటీఆర్ ఆరోపించారు. డబ్బు, మద్యం పంపిణీ వంటి ఆరోపణలు కూడా చేశారు. అయినప్పటికీ ప్రజలు ధైర్యంగా బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చారని వారికి కృతజ్ఞతలు తెలిపారు.సింగరేణి బొగ్గు అంశాన్ని ప్రస్తావిస్తూ, అక్కడ జరిగిన అక్రమాలపై తమ పార్టీ ప్రశ్నించిందని చెప్పారు. ఆ విషయంపై స్పందనగా కొన్ని ప్రాంతాల్లో వామపక్ష పార్టీలు కూడా తమకు మద్దతు ఇచ్చాయని పేర్కొన్నారు. ముఖ్యంగా కొత్తగూడెం ప్రాంతంలో కూనంనేని సాంబశివరావుతో మాట్లాడి సహకారం కోరినట్టు తెలిపారు.

**కాంగ్రెస్, బీజేపీపై విమర్శలు**

కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయనే ఆరోపణను కేటీఆర్ చేశారు. హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో ఛైర్మన్ స్థానాల కోసం బేరసారాలు మొదలయ్యాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు తటస్థ




శక్తులను కలుపుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధమని వెల్లడించారు.బీఆర్ఎస్ నాయకత్వంపై ప్రజలకు విశ్వాసం ఉందని, ముఖ్యంగా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వం రాష్ట్రానికి రక్షణ కవచంలా భావిస్తున్నారని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షంగా తమ పాత్రను సమర్థంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని, నిజంగా విశ్వాసం ఉంటే వారితో రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. ప్రజల అభిప్రాయం ఏంటో అప్పుడు తెలుస్తుందని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలు సాధారణంగా అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయని, అయినప్పటికీ కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లోనూ ప్రజలు స్పష్టమైన సందేశం ఇచ్చారని పేర్కొన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కూడా అధికార పార్టీపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్న సంకేతమని తెలిపారు.

ముందు రోజుల్లో బీఆర్ఎస్ మరింత బలపడేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తటస్థ శక్తులను కలుపుకుని, ప్రజా సమస్యలపై మరింత దృష్టి పెట్టి ఉద్యమాలు చేపడతామని తెలిపారు. స్థానిక స్థాయిలో పనితీరు మెరుగుపరిస్తే ప్రజలు తప్పకుండా ఆదరిస్తారని అన్నారు.మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు ఉత్సాహాన్నిచ్చాయని కేటీఆర్ పేర్కొన్నారు. అధికార పార్టీ ఎంత ప్రయత్నించినా ప్రజల మద్దతు తమకే ఉందని, భవిష్యత్‌లో ఇంకా మెరుగైన ఫలితాలు సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

# కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంకు 330 ప్రత్యేక బస్సులు






**కుషాయిగూడ,ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్టకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కుషాయిగూడ డిపో నుంచి ఈసీఐఎల్ బస్టాండ్ ద్వారా ఫిబ్రవరి 14 నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. మొత్తం 330 ప్రత్యేక బస్సులు వివిధ ప్రాంతాల నుంచి కీసరగుట్టకు రాకపోకలు సాగిస్తాయని వెల్లడించారు. ఈ బస్సులు ఆలయం సమీపం వరకు వెళ్లనున్నాయి. ఈసీఐఎల్ బస్టాండ్ నుంచి ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈసీఐఎల్ బస్టాండ్-కుషాయిగూడ-నాగారం-రాంపల్లి చౌరస్తా-బండ్లగూడ-కీసర మార్గంతో పాటు సికింద్రాబాద్, వెంకటాపురం, ఉప్పల్, అఫ్జల్ గంజ్ ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు చెప్పారు. భక్తులు ఈ ప్రత్యేక బస్సుల సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# కాంగ్రెస్ వైఫల్యాలకు ఇది నిలువుటద్దం..!

**మొదటిపేజీ తరువాయి**

హరీష్ రావు అన్నారు. అధికార పక్షం ఎన్ని అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడినా, ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసినా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపును అడ్డుకోలేకపోయారని ఆయన మండిపడ్డారు. దాదాపు 700కు పైగా వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించడం కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు నిలువుటద్దమని ఆయన అభివర్ణించారు.

అధికార కాంగ్రెస్ పార్టీ బెదిరింపులు, డబ్బు రాజకీయాలకు భయపడకుండా కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా గెలిచి సత్తా చాటారని, బీఆర్ఎస్ నాయకులకు హరీష్ రావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులు సహా యావత్ ప్రభుత్వ యంత్రాంగం ఒక్కటై కొట్లాడినా ప్రజా తీర్పును మార్చలేకపోయారని ఎద్దేవా చేశారు. పార్టీ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలు, సోషల్ మీడియా సైనికుల కృషి వెలకట్టలేనిదని ఆయన ప్రశంసించారు.

రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అభివృద్ధి పూర్తిగా మందగించిందని హరీష్ రావు విమర్శించారు. "ఎన్నికల హామీలు గాలిలో కలిసిపోయాయి.. సంక్షేమ పథకాలు అటకెక్కాయి.. ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా రేవంత్ సర్కార్ కాలం గడుపుతోంది" అని ధ్వజమెత్తారు. అందుకే ప్రజలు ఓటు అనే కొరడాతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పారని, మొన్నటి పంచాయతీ ఫలితాలు, నేటి మున్సిపల్ ఫలితాలే దానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ను గద్దె దించే శక్తి ఒక్క బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉందని ఈ ఫలితాలు కుండబద్దలు కొట్టి చెప్పాయని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉంటూ అధికార పక్షం దౌర్జన్యాలను ఎదుర్కొని సాధించిన ఈ విజయాలు పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయని తెలిపారు. ప్రజాస్వరంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజల ఆశీస్సులతో తెలంగాణలో మళ్లీ గులాబీ జెండా ఎగురవేసే వరకు నిర్విరామ పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.



# ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**మాసాయిపేట ఫిబ్రవరి 14 (ప్రజాస్వరం)**

మాసాయిపేటలో PHC లేకపోవడంపై బీజేపీ మండల అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మండలాన్ని ఏర్పాటు చేసినా ఆరోగ్య కేంద్రాన్ని నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రజా పాలనలోనూ అదే పరిస్థితి కొనసాగడం దురదృష్టకరమని విమర్శించారు. అత్యవసర వైద్యం కోసం ప్రజలు వెల్దుర్తి లేదా తూప్రాన్ వెళ్లాల్సి వస్తోందని, వెంటనే ప్రభుత్వం స్పందించి మండలంలో ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



# గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలు

**గజ్వేల్, 13 ఫిబ్రవరి (ప్రజాస్వరం) :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. మొత్తం 20 వార్డులకు గాను బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని తన పట్టును నిరూపించుకుంది. పార్టీల వారీగా గెలుచుకున్న స్థానాలు: బీఆర్ఎస్: 11 వార్డులు, కాంగ్రెస్ : 07 వార్డులు, బీజేపీ : 01 వార్డు, స్వతంత్రులు : 01 వార్డును సాదించుకున్నారు.

1. కప్పు మమత పోచయ్య, బీఆర్ఎస్
2. గోలి మమత సంతోష్, బీఆర్ఎస్
3. కాముని మురళి, బీఆర్ఎస్
4. రొట్టెల శ్రీనివాస్, బీజేపీ
5. మన్నే రూప వెంకటేష్, బీఆర్ఎస్,
6. బొగ్గుల స్వప్న సురేష్, బీఆర్ఎస్
7. మన్నే విష్ణువర్ధన్ రెడ్డి, కాంగ్రెస్
8. ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్
10. కోట బాబు రాజు, బీఆర్ఎస్
11. కొలిచెలిమేల భవానీ, బీఆర్ఎస్
12. నరసింహా రెడ్డి, కాంగ్రెస్
13. మర్కంటి భాగ్యలక్ష్మి, బీఆర్ఎస్
14. గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, కాంగ్రెస్
15. నక్క సంతోషి రాములు, కాంగ్రెస్
16. నాయిని సత్యలక్ష్మి, కాంగ్రెస్
17. కళ్యాణ్ కర్ పద్మా భాయి నర్సింగ రావు, బీఆర్ఎస్
18. మామిడి శ్రీదర్, బీఆర్ఎస్




19. గంగిశెట్టి చందన, బీఆర్ఎస్ 20. అత్తెల్లి శ్రీనివాస్, స్వతంత్ర.

# ఆంగ్ల భాషా దినోత్సవం ఘనంగా నిర్వహణ
## ఆంగ్ల ఉపాధ్యాయునికి సన్మానం

**ఆదిలాబాద్ జిల్లా ఫిబ్రవరి 13 (ప్రజాస్వరం )**

అదిలాబాద్ జిల్లా స్థానిక అర్బన్ రేడియన్సినల్ స్కూల్లో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అజయ్ (AMO, SSA ఆదిలాబాద్) హాజరై, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆంగ్ల బోధనలో విశేష కృషి చేస్తున్న మార రవికాంత్ రెడ్డిను సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సన్మానం స్వీకరించిన ఆయన మాట్లాడుతూ, "ఆంగ్ల భాషా దినోత్సవం సందర్భంగా నన్ను సన్మానించిన నా సహచర ఉపాధ్యాయులకు మరియు అజయ్ సార్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ ప్రోత్సాహం, మద్దతు నాకు మరింత ప్రేరణనిస్తుంది" అని తెలిపారు. కార్యక్రమంలో ప్రసంగాలు, పదజాల ఆటలు, క్విజ్ పోటీలు, పాటలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకలో పాఠశాల ఉపాధ్యాయులు గణేష్, రాజన్న, హారికతో పాటు బోధనేతర సిబ్బంది దత్తు, రుతిక, స్వప్న, వీణ, రజిత తదితరులు పాల్గొన్నారు.





# సంబురాలు చేసుకున్న బేఆర్ఎస్ నాయకులు

**మనోహరాబాద్ (ప్రజాస్వరం) :**

మెదక్ జిల్లా మనోరాబాద్ మండల కేంద్రంలోని కొనాయపల్లి పిటి , ముప్పిరెడ్డి పల్లి గ్రామాల్లో బిఆర్ఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కెసిఆర్ నియోజకవర్గంలోని గజ్వేల్ తూప్రాన్. మున్సిపాలిటీలో బియాస్ బీఆర్ఎస్ జెండా ఎగరవేయడంతో గ్రామాలలో బిఆర్ఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కొనాయపల్లి పిటి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు పటాకులు కాల్చి స్వీట్లు ఒకరికొకరు తినిపించుకున్నారు. రానున్న కాలంలో తెలంగాణలో మళ్ళీ కేసీఆర్ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు.ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పటాకులు కాల్చారు.



# కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
## మేడ్చల్ సిఐ అద్దాని సత్యనారాయణ

**మేడ్చల్, (ప్రజాస్వరం):**

మేడ్చల్ జిల్లా ఎల్లంపేట్ మున్సిపాలిటీకి సంబంధించిన ఎన్నికల ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నందని మేడ్చల్ సిఐ అద్దాని సత్యనారాయణ అన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఇంకా అమలులో ఉందని గెలుపొందిన అభ్యర్థులు గాని లేదా వారి అనుచరులు గాని ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు సమ్మేళనాలు నిర్వహించరాదని అన్నారు.ఇట్టి ఎన్నికల నియమావళి 16వ తారీకు మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఎల్లంపేట మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరిగేంత వరకు కోడ్ అమలులో ఉంటుందని అప్పటివరకు ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. ఎవరైనా కోడ్ ని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.




# దుబ్బాక గడ్డ " బీఆర్ఎస్ " కు అడ్డా..!

- **ఈ విజయం కేసీఆర్ కు అంకితం**
- **దుబ్బాక అభివృద్ధికి కట్టుబడి ఉంటాం**
- **దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**



**దుబ్బాక, ప్రజాస్వరం, ఫిబ్రవరి 13:**

అధికారంలో ఉన్నా, లేకున్నా దుబ్బాక గడ్డ బీఆర్ఎస్ అడ్డా అని మరోసారి మున్సిపల్ ఎన్నికల్లో నిరూపించుకోవడం జరిగిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 11 స్థానాల్లో జయకేతనం ఎగురవేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. దుబ్బాక తో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో అవినాభావ సంబంధం ఉందని, ఈ విజయం కేసీఆర్ కు అంకితం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.. దుబ్బాక మున్సిపాలిటీలో కాంగ్రెస్ బిజెపిలు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినప్పటికీ ప్రజలు బీ ఆర్ ఎస్ వైపు నిలిచి 11 స్థానాలు కట్టబెట్టడంపై ఆయన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.. బీఆర్ఎస్ నుంచి ముగ్గురు రెబల్ అభ్యర్థులు కూడా విజయం సాధించారని, వారిని కలుపుకొని ముందుకు సాగుతామన్నారు.. అధికారంలో లేనప్పటికీ బి ఆర్ ఎస్ పార్టీ మీద విశ్వాసంతో ఓట్లు వేసిన దుబ్బాక ప్రజలకు అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటామన్నారు.. గెలిచిన కాంగ్రెస్, బిజెపి కౌన్సిలర్లతో పాటు ఎన్నికల్లో ఓటమి చెందిన అభ్యర్థులతో కలిసి రాజకీయాలకు అతీతంగా దుబ్బాక అభివృద్ధి కోసం ముందుకు సాగుతామన్నారు.. ఎన్నికలు అయిపోయాయి ఇక రాజకీయాలతో పనిలేదని, పట్టణ అభివృద్ధి కోసం ముందుకు సాగుదామని ఆయన కోరారు.. సర్పంచ్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోవడం జరిగిందని, అదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ ఎన్నికల్లో గణనీయమైన స్థానాలు సాధించడం జరిగిందన్నారు.. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం రావడం ఖాయమని ఆయన పేర్కొన్నారు..

# కల్లుగీత కార్మికుల హక్కులను కాల రాస్తున్న ప్రభుత్వం

- **కల్లు గీత కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి**
- **నిరసనగా ఇంద్ర పార్క్ వద్ద నిరాహార దీక్షను జయప్రదం చేయండి**
- **కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు పాలకూర్తి శ్రీధర్ గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు తాటి లచ్చులు గౌడ్**



**కన్నాయిగూడెం,ఫిబ్రవరి13(ప్రజాస్వరం):**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గూర్రేవుల తాటి వనంలో కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ ను సొసైటీ అధ్యక్షులు తండ ప్రభాకర్ గౌడ్ అధ్యక్షతన ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు పాలకుర్తి శ్రీధర్ గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు తాటి లచ్చలు గౌడ్ హాజరై మాట్లాడుతూ కల్లుగీత కార్మిక న్యాయమైన సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 17న హైదరాబాద్ ఇందిరా పార్క్ లో నిరాహార దీక్ష నిర్వహించడం జరుగుతుందని దీనికి కన్నాయిగూడెం మండలం నుండి కల్లుగీత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని గీతా కార్మికులకు పిలుపునిచ్చారు

# సమిష్టి కృషితోనే గెలుపు సాధ్యమైంది



**మొదటిపేజీ తరువాయి**

స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు.పట్టణ ప్రాంతాల్లో ఓటర్లు స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజా పాలన, పారదర్శక వ్యవస్థ, అవినీతి రహిత పరిపాలనకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీకి అఖండ ఆదరణ లభించిందన్నారు. ముఖ్యంగా మౌలిక వసతుల విస్తరణ, డ్రైనేజ్, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు వంటి అంశాల్లో ప్రభుత్వం చేపట్టిన చర్యలు ప్రజలను ఆకట్టుకున్నాయని తెలిపారు.

**సంక్షేమ పథకాలే బలమైన ఆధారం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు మద్దతు తెలపడం ఈ ఫలితాల్లో ప్రతిఫలించిందని మంత్రి చెప్పారు. పేదల కోసం చేపట్టిన పథకాలు, మహిళలకు ప్రత్యేక అవకాశాలు, యువతకు ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టడం ప్రజలకు నచ్చిందన్నారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సహా మంత్రివర్గం సమిష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు గ్రామం నుంచి పట్టణం వరకు కష్టపడి పనిచేశాయని అభినందించారు.

**గెలిచిన ప్రజాప్రతినిధులకు అభినందనలు**

కాంగ్రెస్ తరపున గెలిచిన కౌన్సిలర్లు, కార్పొరేటర్లందరికీ మంత్రి అభినందనలు తెలిపారు. ప్రజలు పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం వారి మొదటి బాధ్యత అని సూచించారు. ప్రతి వార్డులో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, స్థానిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.పట్టణాల్లో శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కుల అభివృద్ధి, మున్సిపల్ సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధులుగా వ్యవహరించాలని కోరారు.

**పారదర్శక పాలనకు ప్రజల మద్దతు**

"ప్రజలకు దగ్గరగా ఉండే ప్రభుత్వం" అనే నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి అన్నారు. సమస్యలు వచ్చిన వెంటనే స్పందించే విధానం, అధికారులను బాధ్యతాయుతంగా పనిచేయించే వ్యవస్థ కారణంగా ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. అవినీతి రహిత పరిపాలన, ఫిర్యాదులకు తక్షణ స్పందన వంటి అంశాలు పట్టణ ఓటర్లను ఆకర్షించాయని తెలిపారు.

**రాబోయే మూడేళ్లు అభివృద్ధి దిశగా**

పట్టణ ప్రజలు అందించిన ఆశీర్వాదాన్ని బాధ్యతగా స్వీకరిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాబోయే మూడు సంవత్సరాల్లో మరింత అభివృద్ధి, మరింత సంక్షేమం అందించేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని చెప్పారు. ప్రతి పట్టణం సమగ్ర అభివృద్ధి సాధించేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి పెద్ద బలం అని ఆయన అన్నారు. అదే నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. మున్సిపల్ స్థాయిలో బలమైన పునాది ఏర్పడడంతో రాష్ట్ర అభివృద్ధికి మరింత వేగం వస్తుందని అభిప్రాయపడ్డారు.మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పట్టణ ఓటర్ల స్పష్టమైన తీర్పుతో కాంగ్రెస్ పార్టీ మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతోంది. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు ఇది ప్రజల మద్దతుగా మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# మున్సిపోల్స్‌లో హస్తం హవా



**మొదటిపేజీ తరువాయి**

పార్టీ కార్యాలయాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. కార్యకర్తలు బాణసంచాలు కాల్చి, మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుతున్నారు.

ఈ ఎన్నికల్లో అనేక మున్సిపాలిటీలలో ఫలితాలు ఏకపక్షంగా వచ్చాయి. ముఖ్యంగా ధర్మపురి, కోస్గి మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ ప్రత్యర్థులకు అవకాశమిచ్చకుండా విజయం సాధించింది. నందికొండ, చిట్యాల, భీంగల్, మరిపెడ, దోర్నకల్, చండూరు, హాలియా, చొప్పదండి, సుల్తానాబాద్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ వంటి ప్రధాన మున్సిపాలిటీలలో కూడా కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించి, స్థానికంగా పార్టీ ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. ఉత్తర తెలంగాణ నుండి దక్షిణ తెలంగాణ వరకు అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయాలతో ముసుగుదించారు. మధిర, అశ్వారావుపేట, వైరా, ఇల్లందు, ఏదులాపురం వంటి ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలిచారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఊహించని ఫలితాలు సాధించింది. సంగారెడ్డి మున్సిపాలిటీలో 38 వార్డుల్లో 20కు పైగా స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. సదాశివపేటలో 26 వార్డుల్లో 16 స్థానాల్లో విజయం సాధించబడింది. జోగిపేటలో, మంత్రి దామోదర రాజనరసింహ సొంత నియోజకవర్గంలో 20 వార్డుల్లో 16 స్థానాలు కాంగ్రెస్ గెలిచింది. నర్సాపూర్ మున్సిపాలిటీలో ఫలితాలు ఉత్కంఠ కలిగించేలా వచ్చాయి. కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పార్టీ మధ్య హోరాహోరీ పోరు సాగింది. ఒక వార్డులో ఇరు పార్టీలు సమాన ఓట్లు పొందటంతో బీఆర్ఎస్ విజయం సాధించి, ఆ మున్సిపాలిటీ హంగ్ గా ఏర్పడింది.

నల్గొండ జిల్లాలో 17 మున్సిపాలిటీలలో కాంగ్రెస్ 15 స్థానాల్లో విజయం సాధించగా, బీఆర్ఎస్ 1 స్థానంలో గెలిచింది మరియు ఒక మున్సిపాలిటీ హంగ్ అయ్యింది. మెదక్ జిల్లాలో 19 మున్సిపాలిటీలలో కాంగ్రెస్ 6 స్థానాలు, బీఆర్ఎస్ 6 స్థానాలు, 7 మున్సిపాలిటీలలో హంగ్ ఏర్పడింది. ఆదిలాబాద్ జిల్లాలో 10 మున్సిపాలిటీలలో కాంగ్రెస్ 3 స్థానాలు, బీఆర్ఎస్ 1 స్థానంలో విజయం సాధించి, 6 మున్సిపాలిటీలలో హంగ్ ఏర్పడింది. వరంగల్ జిల్లాలో 12 మున్సిపాలిటీలలో కాంగ్రెస్ 5, బీఆర్ఎస్ 1, 4 మున్సిపాలిటీలలో హంగ్ ఏర్పడింది. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పూర్తి స్వీప్ చేసింది. కరీంనగర్ జిల్లాలో 13 మున్సిపాలిటీలలో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 1 స్థానంలో గెలిచింది, 4 మున్సిపాలిటీలలో హంగ్ ఏర్పడింది. నిజామాబాద్ జిల్లాలో 7 మున్సిపాలిటీలలో 5 స్థానాలు కాంగ్రెస్ గెలుచుకుంది, 2 మున్సిపాలిటీలలో హంగ్ ఏర్పడింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 18 మున్సిపాలిటీలలో 14 స్థానాలు కాంగ్రెస్ గెలుచుకుంది, 4 మున్సిపాలిటీలలో హంగ్ ఏర్పడింది. రంగారెడ్డి జిల్లాలో 13 మున్సిపాలిటీలలో 4 స్థానాలు కాంగ్రెస్ గెలుచుకున్నది, 4 స్థానాలు బీఆర్ఎస్ గెలిచాయి, 2 మున్సిపాలిటీలలో హంగ్ ఏర్పడింది.

ఈ ఎన్నికల్లో బీజేపీ, తెలుగుదేశం పార్టీ, జనసేన, ఇతర పార్టీలు కొన్నికొన్ని స్థానాల్లో మాత్రమే విజయం సాధించాయి. సూర్యాపేట జిల్లా నేరుడు చర్లలో 14వ వార్డ్ కౌన్సిలర్‌గా జనసేన అభ్యర్థి విజయలక్ష్మి గెలిచారు. ఖమ్మం జిల్లా మధిరలో 10వ వార్డ్ కౌన్సిలర్‌గా తెలుగు దేశం పార్టీ అభ్యర్థి బోడేపూడి రేవతి గెలిచారు. ఈ రెండు పార్టీలు ఒక్కో స్థానంలో గెలుస్తూ రాష్ట్రంలో కొత్త ఉత్సాహాన్ని సృష్టించాయి.

కార్పొరేషన్ ఫలితాల్లో కూడా కొన్ని ఆసక్తికర విషయాలు ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో సీపీఐ పార్టీ అనూహ్య ఫలితంతో 25 స్థానాలను గెలుచుకుంది. మొత్తం 47 డివిజన్లలో కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 4, బీజేపీ 1, సీపీఎం 1, స్వతంత్రులు 2 స్థానాల్లో విజయం సాధించారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో 48 డివిజన్లలో కాంగ్రెస్ 35, బీఆర్ఎస్ 10, బీజేపీ 2, స్వతంత్రులు 1 గెలుపు సాధించారు.

ఈ విజయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. సోషల్ మీడియా ద్వారా ఆయన తెలిపారు, రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్‌లలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ప్రజల ఆశీర్వాదం వల్ల సాధ్యమైందని. ప్రతి కార్యకర్త శ్రమ ఫలించిందని, ప్రజల నమ్మకానికి ఇది స్పష్టమైన గుర్తింపన్నారు. భవిష్యత్‌లో ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్ అభివృద్ధి చెందేలా, ప్రజల సంక్షేమం కోసం కొనసాగుతామని ఆయన తెలిపారు.

ఈ ఎన్నికల ఫలితాలతో, తెలంగాణలోని స్థానిక సంస్థలపై కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తలు పండుగ వాతావరణంలో సంబరాలు జరుపుతూ, బాణసంచాలు కాల్చి, పార్టీ జెండాను ఎగురవేస్తున్నారు. ప్రజల ఆధారంతో కాంగ్రెస్ పార్టీ స్థానిక స్థాయిలో ప్రభుత్వ పథకాలను సులభంగా అమలు చేసే సామర్థ్యాన్ని ప్రదర్శించిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోని ఉత్తర, మధ్య, దక్షిణ ప్రాంతాలన్నీ కవర్ అయ్యాయి. ప్రతి జిల్లాలోని ప్రధాన మున్సిపాలిటీల్లో గెలుపు సాధించడం, ముఖ్యంగా ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సదాశివపేట, జోగిపేట, నర్సాపూర్ వంటి ప్రాంతాల్లో ఘన విజయాన్ని సాధించడం పార్టీకి సుదీర్ఘంగా ఉపయోగకరమని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయ వాతావరణంలో ఒక స్పష్టమైన పునరుద్ధరణను చాటుతున్నాయి.



# అంగన్వాడీ–1 & 2 కేంద్రాలను పర్యవేక్షించిన సర్పంచ్ శ్రీమతి తాటి వాణి

**బూర్గంపాడు,ఫిబ్రవరి 13 (ప్రజాస్వరం):**

బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ గ్రామంలోని అంగన్వాడీ-1 మరియు దేవయ్య గుంపు అంగన్వాడీ-2 కేంద్రాలను ఈ రోజు సర్పంచ్ శ్రీమతి తాటి వాణి సందర్శించి పర్యవేక్షించారు. చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, ప్రీస్కూల్ విద్యా కార్యక్రమాలు మరియు కేంద్రాల పరిశుభ్రత పరిస్థితులను సమీక్షించారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించి సరుకుల నిల్వలు, వినియోగ వివరాలను సవివరంగా తనిఖీ చేశారు.అంగన్వాడీ-1 టీచర్ సోడే.నాగరత్నం మరియు అంగన్వాడీ-2 టీచర్ సోడే. రత్నకుమారి తో మాట్లాడి పిల్లల హాజరు, ఆరోగ్య పరిస్థితి మరియు కేంద్రాల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.పిల్లల ఆరోగ్యం,పోషకాహారం మరియు విద్యా అభివృద్ధి విషయంలో మరింత శ్రద్ధ వహించాలని సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. గ్రామ చిన్నారుల మంచి భవిష్యత్తు కోసం నాణ్యమైన సేవలు అందించడంలో ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని సర్పంచ్ తెలిపారు.

# బంగ్లాదేశ్‌లో రాజకీయాల్లో పెను మార్పులు



**మొదటిపేజీ తరువాయి**

ఎన్నికలు దేశ రాజకీయ దిశను మార్చేశాయి. తారిక్ రెహమాన్ నేతృత్వంలోని బీఎన్‌పీ పార్టీ ఘన విజయం సాధించి అధికారానికి దారితీసే మార్గాన్ని సులభం చేసుకుంది.

**హసీనా రాజీనామాతో పరిణామాలు**

2024 ఆగస్టులో బంగ్లాదేశ్‌లో విద్యార్థుల నేతృత్వంలో పెద్ద ఎత్తున నిరసనలు ప్రారంభమయ్యాయి. అవి త్వరలోనే దేశవ్యాప్త ఉద్యమంగా మారాయి. నిరసనలను అణచివేయడానికి భద్రతా దళాలు కాల్పులు జరపడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో ప్రజల్లో ఆగ్రహం మరింత పెరిగింది. పరిస్థితులు అదుపులోకి రాకపోవడంతో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయింది. ఆమె భారత్‌కు చేరుకోవడంతో రెండు దేశాల మధ్య సంబంధాలపై కూడా ప్రభావం పడింది.

**తాత్కాలిక ప్రభుత్వంగా యూనస్**

దేశంలో శాంతి స్థాపన కోసం నోబెల్ బహుమతి గ్రహీత ముహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ప్రజలు ప్రారంభంలో ఆయనపై ఆశలు పెట్టుకున్నారు. కానీ పరిస్థితులు అంత సులభంగా మారలేదు. దేశంలో చెలరేగిన హింస పూర్తిగా ఆగలేదు. ముఖ్యంగా హిందూ సమాజంపై దాడులు జరిగినట్లు నివేదికలు వెలువడ్డాయి. ఈ సంఘటనలు అంతర్జాతీయంగా కూడా ఆందోళన కలిగించాయి.భారత్‌తో యూనస్ ప్రభుత్వం దూరం పెంచిందనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. చైనా, పాకిస్తాన్‌లతో సంబంధాలను బలపరచాలని ప్రయత్నించిందని విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భారత్-బంగ్లాదేశ్ సంబంధాలు కొంత ఉద్రిక్తంగా మారాయి.

**ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం**

ఈ అనిశ్చితి మధ్య జరిగిన తాజా పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. మొత్తం 299 స్థానాల్లో 212 స్థానాలను బీఎన్‌పీ కైవసం చేసుకుంది. దీంతో తాత్కాలిక ప్రభుత్వానికి ప్రజలు గుడ్‌బై చెప్పారు. దేశానికి స్థిరమైన పాలన అవసరమని ఓటర్లు సూచించారు.తారిక్ రెహమాన్ ఎన్నో సంవత్సరాల తర్వాత దేశ రాజకీయాల్లో తిరిగి ప్రధాన పాత్రలోకి వచ్చారు. లండన్‌లో దీర్ఘకాలం గడిపిన ఆయన గత డిసెంబరులో ఢాకాకు చేరుకున్నారు. ఇప్పుడు ఆయన ప్రధానమంత్రి పీఠం వైపు అడుగులు వేస్తున్నారు. తారిక్ రెహమాన్ తన ప్రసంగాల్లో "బంగ్లాదేశ్ ఫస్ట్" అనే నినాదాన్ని ముందుకు తెచ్చారు. దేశ ప్రయోజనాలే ప్రధానమని ఆయన స్పష్టం చేస్తున్నారు. విదేశాంగ విధానంలో భారత్, చైనా, పాకిస్తాన్‌లను సమానంగా చూడాలని ఆయన భావిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.భారత్‌కు ఇది ఒక అవకాశం కూడా, ఒక సవాల్ కూడా. ఎన్నికల ఫలితాలు పూర్తిగా రాకముందే భారత ప్రధాని మోదీ తారిక్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది సంబంధాలను పునరుద్ధరించాలనే ఆసక్తిని చూపింది.

**భారత్‌తో బంధాలు ఎలా?**

భౌగోళికంగా చూస్తే రెండు దేశాలు విడదీయరాని సంబంధంతో ఉన్నాయి. దాదాపు 4,000 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉంది. వాణిజ్యం, విద్యుత్ సరఫరా, రవాణా మార్గాలు, సాంస్కృతిక బంధాలు - ఇవన్నీ రెండు దేశాలను బలంగా కట్టిపడేశాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారత్‌ను పూర్తిగా పక్కన పెట్టడం బంగ్లాదేశ్‌కు సాధ్యం కాదు.అయితే బంగ్లాదేశ్ యువతలో భారత్‌పై కొంత అనుమానం పెరిగింది. ముఖ్యంగా హసీనా భారత్‌కు రావడంతో ఆ భావన బలపడింది. ఈ పరిస్థితుల్లో తారిక్ రెహమాన్ సమతుల్య ధోరణి పాటించాల్సిన అవసరం ఉంది.

**హిందువుల భద్రత ప్రశ్న**

బంగ్లాదేశ్ జనాభాలో సుమారు 8 శాతం హిందువులు ఉన్నారు. గత కొంతకాలంగా వారిపై దాడులు జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో హిందూ సమాజంలో ఆందోళన ఉంది. తారిక్ రెహమాన్ ఈ అంశంపై మితంగా స్పందించారు. "మతం వ్యక్తిగత విషయం, దేశం అందరిదీ" అని చెప్పారు. అందరికీ రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు.అయితే ఈ హామీలు నేలమీద ఎంతవరకు అమలవుతాయన్నది చూడాలి. శాంతి భద్రతలు పటిష్టంగా ఉండాలి. మైనారిటీలపై దాడులు ఆగాలి. అప్పుడే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

**జలవివాదాలు, సరిహద్దు సమస్యలు**

తారిక్ రెహమాన్ కొన్ని కీలక అంశాల్లో గట్టి వైఖరి తీసుకుంటున్నారు. టీస్టా నది జలవిభజన ఒప్పందంపై బంగ్లాదేశ్‌కు న్యాయం కావాలని చెబుతున్నారు. సరిహద్దు కాల్పులు ఆగాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. తీస్తా, పద్మా నదులు తమ దేశ జీవనాధారమని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశాలు భవిష్యత్తులో భారత్-బంగ్లాదేశ్ మధ్య చర్చలకు కారణమయ్యే అవకాశం ఉంది. రెండు దేశాలు పరస్పర అవగాహనతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.తారిక్ రెహమాన్ గతం కూడా ఇప్పుడు చర్చకు వస్తోంది. 2001 నుంచి 2006 వరకు బీఎన్‌పీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు భారత్‌తో సంబంధాలు అంతగా సానుకూలంగా లేవు. అప్పట్లో కొన్ని వివాదాలు చోటుచేసుకున్నాయి. అవినీతి ఆరోపణలు, రాజకీయ వివాదాలు ఆయనపై ముద్ర వేశాయి. అయితే ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. దేశం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొన్న తర్వాత ప్రజలు మార్పు కోరుకున్నారు. తారిక్ రెహమాన్‌కు ఇది ఒక కొత్త అవకాశంగా మారింది. గతాన్ని పక్కనబెట్టి, స్థిరమైన పాలన అందిస్తేనే ఆయన నాయకత్వం నిలదొక్కుకుంటుంది.

**ముందున్న మార్గం**

బంగ్లాదేశ్ ప్రస్తుతం కీలక దశలో ఉంది. ఆర్థికంగా, రాజకీయంగా దేశాన్ని స్థిరపరచడం కొత్త ప్రభుత్వానికి పెద్ద సవాల్. యువతలో పెరిగిన అసంతృప్తిని తగ్గించాలి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలి. మైనారిటీల భద్రతను నిర్ధారించాలి. అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠను నిలబెట్టాలి. భారత్‌తో సంబంధాలు కూడా కీలకం. పరస్పర గౌరవంతో, సంభాషణతో ముందుకు సాగితే రెండు దేశాలకూ ప్రయోజనం ఉంటుంది. లేకపోతే పాత సమస్యలు మళ్లీ తలెత్తే అవకాశం ఉంది.బంగ్లాదేశ్ రాజకీయాల్లో జరిగిన ఈ మార్పు దక్షిణాసియా ప్రాంతానికి కూడా ప్రాధాన్యం కలిగించింది. తారిక్ రెహమాన్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ఎలాంటి దిశలో అడుగులు వేస్తుందో చూడాలి. హిందువుల భద్రత, భారత్‌తో బంధాలు, జలవివాదాలు - ఇవన్నీ కీలక అంశాలు. ప్రస్తుతం ప్రజల్లో ఒక ఆశ, ఒక సందేహం రెండూ ఉన్నాయి. ఆశ ఏమిటంటే - దేశానికి స్థిరమైన పాలన రావాలి. సందేహం ఏమిటంటే - గతం మళ్లీ పునరావృతమవుతుందా? సమాధానం కాలమే చెబుతుంది. అయితే ఒక విషయం స్పష్టం భారత్, బంగ్లాదేశ్ రెండు దేశాలు జాగ్రత్తగా, పరస్పర విశ్వాసంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

# ఉచిత కంటి వైద్య శిబిరం

**వలిగొండ ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని నాతళ్ళగూడెం గ్రామంలో పుష్పగిరి ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో. ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మరియు గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అందజేశారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోటి జంగమ్మ లింగస్వామి వార్డు మెంబర్లు నారి లింగస్వామి మస్కు నరసింహ మరియు నూట నాగార్జున బాలయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# పద్మశాలి టౌన్‌షిప్‌లో ఉచిత వైద్య శిబిరం

**కాప్రా,ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

కాప్రా సర్కిల్ డా. ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని శ్రీ భావనాఋషి కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో పద్మశాలి టౌన్‌షిప్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అధ్యక్షులు సీత ఆంజనేయులు సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి పున్న రమేష్, కమిటీ సభ్యులు గుర్రం విశ్వేశ్వర్ రావు, సొసైటీ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్‌సీడీ శిబిరంలో భాగంగా రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య కార్డు నమోదు ప్రక్రియను కూడా చేపట్టి పలువురికి నమోదు సౌకర్యం కల్పించారు. కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమాదేవి, డాక్టర్ ప్రమోద్ కుమార్, ఎన్‌సీడీ బృందం, ఏఎన్ఎమ్ పి. ఝాన్సీ, ఆశా కార్యకర్తలు పాల్గొని వైద్య సేవలు అందించారు. కాలనీ వాసులు సొసైటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఐజేయూ ఆధ్వర్యంలో పదోవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ

- సమాజ భవిష్యత్తును మార్చే శక్తివంతమైన ఆయుధం విద్య
- చిత్త నూరి చిత్తనూరి శ్రీనివాస్ ఐ జె యూ జిల్లా అధ్యక్షులు

**కొత్తగూడ,ఫిబ్రవరి 13 (ప్రజాస్వరం):**

సమాజ అభివృద్ధిలో విద్యే మౌలిక చిత్తలూరి శ్రీనివాస్కక్తిగా నిలుస్తుంది అని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ టియుడబ్ల్యూజె (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు...శుక్రవారం నాడు కొత్తగూడ మండల ఐజేయూ కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడ మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు... ఐజేయూ కొత్తగూడ మండల అధ్యక్షులు ఎస్.కె. సల్మాన్ పాషా అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్,మండల విద్యాశాఖ అధికారి గుమ్మడి లక్ష్మినారాయణ,పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు నెల్లుట్ల భాస్కర్, ట్రైబల్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ ,గూడూరు మండలం అధ్యక్షులు యకంబ్రం,జిల్లా నాయకులు కరుణాకరరెడ్డి లు ముఖ్య అతిథిలుగా హాజరైనారు.... ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య అనేది వ్యక్తి జీవితాన్నే కాదు, సమాజ భవిష్యత్తును మార్చే శక్తివంతమైన ఆయుధమని తెలిపారు. ఉపాధ్యాయులు ఎటువంటి స్వార్థం







లేకుండా విద్యార్థుల కోసం తమ జీవితాలను అంకితం చేస్తున్నారని ప్రశంసించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో చదువుకుంటే తప్పకుండా విజయ శిఖరాలను చేరుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అవసరాలను ముందుగానే గుర్తించి వారికి అవసరమైన సామగ్రిని అందించడం జర్నలిస్ట్ సంఘం సేవాభావానికి నిదర్శనమని,,, ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు చదువుపై మరింత దృష్టి పెట్టేలా ప్రోత్సహించిందని మండల విద్యాశాఖ అధికారి గుమ్మడి లక్ష్మీనారాయణ అభినందించారు... సమాజానికి వార్తలు అందించడమే కాకుండా, భవిష్యత్ తరాలకు వెలుగు చూపే కార్యక్రమాలు చేపడుతూ టీయూడబ్ల్యూజే-ఐజేయూ సంస్థ ఆదర్శంగా నిలుస్తోందని , విద్యాభివృద్ధే లక్ష్యంగా జర్నలిస్టులు చేపడుతున్న ఈ తరహా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెల్లూట్ల భాస్కర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐజేయు జిల్లా నాయకులు పాలడుగు శ్రీధర్, మహమ్మద్ అజ్మీర్,శెట్టి పరశురాములు ,మండల ఉపాధ్యక్షులు గోగు విజయ్ కుమార్,దేసూ వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి తీగల ప్రేమ్ సాగర్,గంగిశెట్టి రాకేష్ వర్మ, ముఖ్య సలహాదారులు బొజ్జ సునీల్,ఉబ్బని శ్రీహరి,దామెర అశోక్,కూస బిక్షపతి,దేవేందర్, సుధాకర్,చాపల శ్రీనివాస్, నాంపల్లి రాజ్ కుమార్,సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.



## ఐ టి సి ఆధ్వర్యంలో రక్త హీనత (అనీమియా) అవగాహన కార్యక్రమం

**బూర్గంపాడు,ఫిబ్రవరి 13 (ప్రజాస్వరం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం, ఎం.పి. బంజర ప్రభుత్వ జెడ్పీ హై స్కూల్‌లో ఐటీసీ సారపాక ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తహీనత (అనీమియా) అవగాహన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డి ఎం & హెచ్ ఓ) డా. తుకారం రాథోడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు గర్భిణీ స్త్రీలకు అనీమియా స్క్రీనింగ్ మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ అనీమియా లక్షణాలు, కారణాలు, నివారణ చర్యల గురించి వివరించారు. మంచి ఆరోగ్యం కోసం సమతుల్య ఆహారం, రోగనిరోధక శక్తి పెంపు, ఆకుకూరలు, తాజా కూరగాయలు,పండ్లు,డ్రై ఫ్రూట్స్ వినియోగం అవసరమని తెలిపారు. నూలి పురుగుల నివారణ మాత్రల వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రత, సరైన విధానంలో చేతులు కడుక్కోవడం (సుమన్ కె), మంచి అలవాట్లు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.అదేవిధంగా స్పర్శ కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమం ముగింపు వేడుకను కూడా నిర్వహించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డా. సాహితి (యం ఓ,పి హెచ్ సి ఎం.పి. బంజర), డీపీఎంఓ మోహన్, రవి (ఎం పి హెచ్ ఈ ఓ),గీతా పల్లవి, రాజేష్ కుమార్,ఐ టి సి సి ఎస్ ఆర్ సభ్యులు మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## వెల్వర్తి గ్రామంలో శివాలయానికి మైక్ సెట్ విరాళం అందించిన ప్రశాంత్

**వలిగొండ ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెల్వర్తి గ్రామంలోని శివాలయానికి, కాసుల శంకరయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కాసుల ప్రశాంత్ మైక్ సెట్ ను విరాళంగా శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సామల కొండల్ రెడ్డి, సభ్యులు పరకాల కిషోర్, మల్లం గణేష్, పరకాల సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిట్టోజు నరసింహ చారి,చిట్టోజు వెంకటనారాయణ చారికి మైక్ సెట్ ను అందజేశారు.



## మున్సిపల్ కార్పొరేషన్లలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం

- బూర్గంపాడు: మొరంపల్లి బంజరలో సంబరాలు
- ప్రజా పాలన ఫలితమే ఈ విజయం

**భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

తెలంగాణ మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలపై బూర్గంపాడు మండలం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వీరారెడ్డి ఆధ్వర్యంలో మొరంపల్లి బంజర సెంటర్లో బాణాసంచా కాల్చి ఘనంగా సంబరాలు నిర్వహించుకున్నారు..రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు వీరారెడ్డి గ్రామస్తులు తెలిపారు.భుజాలు కాయలు కాసేలా కాంగ్రెస్ పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రతి కార్యకర్త విజయం అన్నారు . రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలన, పేద మధ్య తరగతి ప్రజల సంక్షేమం, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారని అన్నారు.





## మున్సిపాలిటీలలో గెలుపొందిన కాంగ్రెస్ కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర,ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

దేవరకద్ర, భూత్పూర్ కొత్తకోట మున్సిపాలిటీలలో గెలుపొందిన కాంగ్రెస్ కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డ జిఎంఆర్ ఈ సందర్భంగా నూతనంగా గెలుపొందిన కౌన్సిలర్లు ఎమ్మెల్యే జిఎంఆర్ ధన్యవాదాలు తెలియజేశారు.



## ఎంపీపీ ఎస్ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన బూర్గంపాడు సర్పంచ్ ఉప సర్పంచ్

**బూర్గంపాడు ఫిబ్రవరి 13 (ప్రజాస్వరం)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ స్కూల్ లో మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసిన బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు ఉపసర్పంచ్ గుండె వెంకన్న విద్యార్థుల పట్ల ఎంతో శ్రద్ధ చూపుతున్న బూర్గంపాడు సర్పంచ్ ఉప సర్పంచ్ పాఠశాలలో చదువుతున్న పిల్లలందరికీ మంచి విద్యాబోధన అందించాలని అలాగే మెరుగైన భోజనం అందాలి అంతేకాకుండా ప్రభుత్వ ఆహార జాబితా ప్రకారం భోజనం ప్రతి రోజు జాబితాలో ఉన్న విధంగా అందించాలని సూచించారు అనంతరం మంచినీటి సదుపాయం సక్రమంగా ఉండాలని ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంకులను శుభ్రపరచుకొని విద్యార్థులకు మంచినీటిని అందించాలని సర్పంచ్ మందా నాగరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు సర్పంచ్ మంద నాగరాజు ఉపసర్పంచ్ గుండె వెంకన్న ప్రైమరీ స్కూల్ హెచ్ఎం జి శేషగిరి మరియు గ్రామపంచాయతీ సిబ్బంది అనిల్ దిలీప్ పాల్గొన్నారు.



# ప్రైవేట్ ఆసుపత్రులపై వైద్య శాఖ ఆకస్మిక తనిఖీ

**మేడ్చల్,ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులపై వైద్య మరియు ఆరోగ్య శాఖ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమాగౌరి ఆధ్వర్యంలో డా. పవన్, వసంత, సిబ్బంది కలిసి ప్రగతి నగర్‌లోని ప్రసాద్ హాస్పిటల్, రోడ్ నంబర్ 4లోని అదే యూనిట్‌ను పరిశీలించారు. ఆసుపత్రులలో ప్రసూతి సేవలు, స్కానింగ్ కేంద్రాలు, ఆపరేషన్ థియేటర్ నిర్వహణ, రికార్డులు, లైసెన్సులు, సర్టిఫికెట్లు, పరిశుభ్రత పరిస్థితులను సవివరంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవల నాణ్యత, భద్రతా ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధనల అమలును సమీక్షించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అంశాలపై నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు హెచ్చరించారు. లోపాలు సరిదిద్దని యెడల చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మరోవైపు డా. గీతా ఆధ్వర్యంలోని బృందం శ్రీకర హాస్పిటల్, విజయ హాస్పిటల్, రామరాజ్ హాస్పిటల్స్‌లలో విస్తృత తనిఖీలు నిర్వహించింది.జిల్లావ్యాప్తంగా ఈ చర్యలు కొనసాగనున్నట్లు వైద్యశాఖ వెల్లడించింది.






WWW.PRAJASWARAMDAILY.COM

# శివనామస్మరణంతో మారుమ్రోగిన తాళ్లపల్లి

- ముఖ్యఅతిథిగా హాజరైన తాళ్లపల్లి గ్రామ సర్పంచ్ కందికంటి స్వాతి మానిక్యం గౌడ్
- ఉప సర్పంచ్ అక్క మొల్ల అంజయ్య
- ఆయా గ్రామాల శివ స్వాములు హాజరై ఆటపాటలతో శివనామస్మరణ
- అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టిన శివ స్వాములు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,

**ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో శుక్రవారం శివ స్వాముల మహా పడిపూజ గ్రామంలోని హనుమాన్ దేవాలయం దగ్గర శివ స్వాముల మహా పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమానికి ఆయా గ్రామాల నుండి వచ్చిన శివ స్వాములు స్వామి వారి సన్నిధిలో ఆటపాటలతో ఘనంగా మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు, గత కొన్ని రోజుల నుండి శివనామస్మరణలతో ఉపవాస దీక్షలు చేసిన శివ స్వాములు మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శ్రీ శ్రీశైల మల్లికార్జున స్వామి సన్నిధిలో ఆటపాటలతో మరియు ధూపదీప నైవేద్యాలతో తాళ్లపల్లి గ్రామంలో శివనామస్మరణం దద్దరిల్లింది, ఈ మహా



పడిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాళ్లపల్లి సర్పంచ్ కందికంటి స్వాతి మాణిక్యం గౌడ్, ఉప సర్పంచ్ అక్క మొల్ల అంజయ్య పంచాయతీ వార్డు సభ్యురాలు నవనీత, ప్రకాష్, షాబాద్ మండలఎమ్మార్పీఎస్ అధ్యక్షులు అక్క మొల్ల జగన్, పురుషోత్తమా చారి, తాళ్లపల్లి గ్రామ ప్రజలు, ఈ యువకులు, నాయకులు, మహిళలు,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## వనపర్తి, పెబ్బేరు మునిసిపాలిటీలు
# కాంగ్రెస్ పార్టీ కైవసం

- మున్సిపల్ ఎన్నికల్లో హస్తం హవా..
- సింగిల్ డిజిట్ కే పరిమితమైన బీఆర్ఎస్.
- వనపర్తిలో ఉనికి నిలుపుకున్న బిజెపి.

**వనపర్తి ఫిబ్రవరి 13 (ప్రజాస్వరం):**

వనపర్తి,పెబ్బేరు మునిసిపాలిటీలపై కాంగ్రెస్ పార్టీ అధికారం చలాయించనుంది. శుక్రవారం జరిగిన మునిసిపాలిటీ కౌన్సిలర్ ఎన్నికల ఫలితాల్లో హస్తం దెబ్బకు కారు సిపిఎంతో కలుపుకొని 9 సీట్లకే సరిపెట్టుకొని వెనకబడింది.డబుల్ ఇంజన్ సర్కార్ గా పిలువబడే బిజెపికి పెబ్బేర్ లో ఒక్క సీటు కూడా రాకపోగా వనపర్తిలో 33 వార్డుల్లో అభ్యర్థులు బరిలో నిలిస్తే రెండే రెండు సీట్లలో విజయం సాధించి ఉనికి కాపాడుకున్నారు.వనపర్తి మునిసిపాలిటీలో 33 వార్డులకు గాను ఇండిపెండెంట్ లతో కలుపుకొని కాంగ్రెస్ 22 స్థానాలు, బిఆర్ఎస్ పార్టీ, సిపిఎం ఒక స్థానంతో కలుపుకొని 9,బిజెపి 2, దక్కించుకోగా పెబ్బేరులో 12 స్థానాలకు గాను కాంగ్రెస్ 7, బిఆర్ఎస్ 5 స్థానాల్లో విజయం సాధించి గట్టి పట్టు నిలుపుకున్నారు.వనపర్తి లో అధికార కాంగ్రెస్ పార్టీకి రెబెల్స్ బెడద అధికంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించడం విశేషం.ఈసారి టికెట్ల కేటాయింపులో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, డిసిసి అధ్యక్షులు శివసేనారెడ్డిలు సమన్వయంతో ముందుకు సాగారు. ఎన్నికల ప్రచారంలో వారు ముగ్గురు గట్టిగా తిరిగి అభ్యర్థులను గెలిపించుకోవడంలో సఫలీకృతులయ్యారు.ఈనెల 16న చైర్మన్ ల ఎంపికలు ఈ ముగ్గురు ఒకే నిర్ణయంతో ముందుకు సాగుతారో లేక విడివిడిగా తమ మద్దతుదారులను ప్రోత్సహిస్తారో వేచి చూడాలి.

## శ్రీ పోలేపల్లి ఎల్లమ్మ ని దర్శించుకున్న కొడంగల్ ఇన్చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి.

**వికారాబాద్ ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

దుద్యాల మండలం పోలేపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర మహోత్సవ కార్యక్రమంలో కొడంగల్ ఇన్చార్జ ఎనుముల తిరుపతిరెడ్డి దర్శనం చేసుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆలయ కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికారు.



## నుమాయిష్–2026లో జీహెచ్ఎంసీకి 'బెస్ట్ స్టాల్' అవార్డు

- స్వయం సహాయక సంఘాల మహిళలకు అభినందనలు : కమిషనర్ ఆర్.వి. కర్ణన్

**హైదరాబాద్ (ప్రజాస్వరం):**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)కు నుమాయిష్-2026 ఎగ్జిబిషన్లో 'బెస్ట్ స్టాల్ అవార్డు' లభించింది. నాంపల్లిలో నిర్వహించిన నుమాయిష్లో జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ స్టాల్లో 35 స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన చేతివృత్తి ఉత్పత్తులను ప్రదర్శనతో పాటు విక్రయానికి ఉంచారు. పూర్తిగా చేతితో తయారు చేసిన ఈ ఉత్పత్తులకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నుమాయిష్ను సందర్శించిన వేలాదిమంది ఈ స్టాల్ను సందర్శించి ఉత్పత్తులను కొనుగోలు చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ పేరుతో నుమాయిష్ నిర్వాహకులు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గోషామహల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి ప్రశంసా పత్రం, మెమెంటోను స్వీకరించారు. జీహెచ్ఎంసీకి 'బెస్ట్ స్టాల్ అవార్డు' రావడం పట్ల కమిషనర్ ఆర్.వి. కర్ణన్ హర్షం వ్యక్తం చేశారు. తమ ఉత్పత్తులు ప్రదర్శించిన స్వయం సహాయక సంఘాల సభ్యులను, పట్టణ సామాజిక అభివృద్ధి అధికారులను ఆయన అభినందించారు




## బాన్సువాడ వార్డు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం,కార్యకర్తల సంబరాలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. 4వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి గైక్వాడ్ రుక్మిణీ, బీఆర్ఎస్ అభ్యర్థిపై 10 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ విజయంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. లెక్కింపు కేంద్రం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.



## 17వ వార్డులో ఫర్హా నాజ్ లాయక్ గెలుపు

**కామారెడ్డి ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మున్సిపాలిటీలోని 17వ వార్డులో ఎంఐఎం అభ్యర్థి ఫర్హా నాజ్ లాయక్ గెలుపొందారు. ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థిపై 23 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. ఎంఐఎం శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. లెక్కింపు కేంద్రం వద్ద ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.




## తూప్రాన్ మున్సిపల్లో బి ఆర్ ఎస్ సత్తా

**మెదక్ తూప్రాన్ ఫిబ్రవరి 13 (ప్రజాస్వరం):**

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ బీఆర్ఎస్ స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించింది. మొత్తం 16 వార్డుల్లో బీఆర్ఎస్ 9 స్థానాలు గెలుచుకొని మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకోబోతుంది.

బీజేపీ 3 స్థానాలు, కాంగ్రెస్ 4 స్థానాలు దక్కించుకున్నాయి. వార్డుల వారీగా గెలుపొందిన అభ్యర్థులు పార్టీల వివరాలు

1వ వార్డు - బీఆర్ఎస్ బొంది రజిని రవీందర్ గౌడ్
2వ వార్డు - బీజేపీ చందా అశోక్
3వ వార్డు - బీఆర్ఎస్ - బైరం సత్యలింగం
4వ వార్డు -బీఆర్ఎస్ -రాథోడ్ జైపాల్ నాయక్
5వ వార్డు - బీఆర్ఎస్ చెలిమెల ప్రియాంక
6వ వార్డు - బీఆర్ఎస్ - కొక్కొండ సమత కాశిరెడ్డి
7వ వార్డు - బీజేపీ మన్నే స్వామి
8వ వార్డు - బీఆర్ఎస్ బొడ్డు రాధాకుమారి శ్రీనివాస్
9వ వార్డు - బీఆర్ఎస్ బోల్లబోయిన ఐలేష్ యదవ్
10వ వార్డు -బీఆర్ఎస్ -మునిరాతిలక్ష్మిమల్లేష్
11వ వార్డు - బీజేపీ బొల్లం సత్యనారాయణ
12వ వార్డు - కాంగ్రెస్ - రామునిగారి స్వప్న నాగరాజు గౌడ్
13వ వార్డు - బీఆర్ఎస్ -చెలిమెల రాములు
14వ వార్డు - కాంగ్రెస్ సబితా నాగేష్
15వ వార్డు - కాంగ్రెస్ అన్నపూర్ణ నారాయణ గుప్తరం
16వ వార్డు - కాంగ్రెస్ జోష్ణ

మొత్తం ఫలితాల్లో బీఆర్ఎస్ ఆధిక్యం స్పష్టంగా కనిపించగా, మున్సిపల్ పాలనపై ఆ పార్టీ పూర్తి నియంత్రణ సాధించింది. చైర్మన్ పదవి బీఆర్ఎస్ ఖాతాలోకి వెళ్లడం పార్టీ శ్రేణుల్లో ఆనందాన్ని నింపింది. ఇక ప్రతిపక్షమైన బీజేపీ, కాంగ్రెస్ తమకు దక్కిన వార్డుల్లో బలమైన పోటీ ఇచ్చినట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తూప్రాన్ మున్సిపల్లో కొత్త పాలకవర్గం త్వరలో బాధ్యతలు స్వీకరించనుంది. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ పీఠంకు కావలసిన బిఆర్ఎస్ కౌన్సిలర్లను ఇన్చార్జులు బొల్లంపల్లి బబుల్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి సత్యనారాయణ గౌడ్ కల్లూరి హనుమంతరావు కల్లూరి హరికృష్ణ, వెంకట్రాంరెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సతీష్ చారి, కిష్టారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ ఆంజనేయులు గౌడ్ బొడ్డు వెంకటేశ్వర్లను, తూప్రాన్ మున్సిపాలిటీ ఇన్చార్జులను బీఆర్ఎస్ పార్టీ పెద్దలు కెసిఆర్, హరీష్ రావు, కేటీఆర్, యాదవ రెడ్డి, పద్మ దేవేందర్ రెడ్డి వంటేరు ప్రతాప్ రెడ్డిలు అభినందించారు.




## బాన్సువాడ మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపాలిటీ చైర్మన్ పీఠం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. 19 వార్డులకు గాను 11 వార్డుల్లో స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. బాన్సువాడ మున్సిపాలిటీ చైర్మన్ పీఠం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. 19 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 11, బీఆర్ఎస్ 3, బీజేపీ 3, ఎంఐఎం 1, స్వతంత్రులు ఒకరు గెలుపొందారు.దీంతో కాసుల విజయ బాలరాజ్ చైర్మన్గా పదవీబాధ్యతలు చేపట్టనున్నారు.

**వార్డుల వారీగా వివరాలు ఇవే..**

1వ వార్డు నాశ్రీన్ బేగం(బీఆర్ఎస్), 2వ వార్డు జంగం రాజశేఖర్( కాంగ్రెస్), 3వ వార్డు ఫకీం (కాంగ్రెస్), 4వ వార్డు రుక్మిణి (కాంగ్రెస్), 5వ వార్డు కాసుల విజయ బాలరాజు (కాంగ్రెస్), 6వ వార్డు అంజుం బేగం (బీఆర్ఎస్), 7వ వార్డు సామల మానస(బీజేపీ), 8వ వార్డు దొనకంటి శ్యామల( కాంగ్రెస్), 9వ వార్డు పాశం ఆమని( బీజేపీ), 10వ వార్డు ఎరుకల నగేష్ (కాంగ్రెస్), 11వ వార్డు గడుముల లింగం (కాంగ్రెస్), 12వ వార్డు అంజా గౌడ్ (స్వతంత్ర), 13వ వార్డు ఖాలెక్ (కాంగ్రెస్), 14వ వార్డు నార్ల వసంత నందకిషోర్ (కాంగ్రెస్), 15వ వార్డు వాంకార్ రమేష్ (కాంగ్రెస్), 16వ వార్డు గజ్జల మహేష్( బీజేపీ), 17వ వార్డు ఫర్హానాస్( ఎంఐఎం),18వ వార్డు రేష్మ ఎజాజ్ (కాంగ్రెస్), 19వ వార్డు ఎండీ మక్బుల్ (బీఆర్ఎస్).



## 1వ వార్డులో నస్రీన్ బేగం ఫెరోజ్ ఖాన్ గెలుపు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మున్సిపాలిటీలోని 1వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి నస్రీన్ బేగం ఫెరోజ్ ఖాన్ గెలుపొందారు. ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థిపై 79 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. లెక్కింపు కేంద్రం వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.



## బాన్సువాడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఖలీల్ ఘన విజయం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13(ప్రజాస్వరం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపల్ ఎన్నికల్లో 13వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ అబ్దుల్ ఖలీల్ విజయం సాధించారు. ఆమె తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థిపై 82 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఫలితంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. లెక్కింపు కేంద్రం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. మిగిలిన వార్డుల ఫలితాలు కూడా వెలువడుతున్నాయి. యువ నాయకుడు మహమ్మద్ గౌస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999